సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 25 । జనవరి । 2025



మైనర్‌కు బండి.. డేంజరండి

మైనర్లు ద్విచక్ర వాహనాలపై హల్ చల్ చేస్తున్నారు. రహదారి నిబంధనలు తెలియని వీరికి వాహనాలిచ్చి రోడ్లపైకి పంపిన తల్లిదండ్రులు తగిన మూల్యం చెల్లించుకుంటున్నారు. -IIలో



బాబును ప్రజలు ఎన్నటికీ నమ్మరు

సీఎం చంద్రబాబు గడచిన ఏడు నెలల్లో పేదలకు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టే పాలన చేశారని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 66 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి టౌన్: జిల్లా వ్యాప్తంగా నియోజక వర్గాల వారీగా 2025-2026 సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల అనుమతి కోసం దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో సుబ్రహ్మణ్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే అప్‌గ్రేడ్ కోసం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు జనవరి 31వ తేదీ వరకు గడువు పెంచినట్లు చెప్పారు.

తిరుపతి ఐసీడీఎస్ పీడీగా వసంతబాయి



కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా వసంతబాయిని నియమిస్తూ మహిళా శిశు సంక్షేమశాఖ సెక్రటరీ ఎ.సూర్య కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె 2016 నుంచి 2022 వరకు రాయచోటి సీడీపీఓగా పనిచేశారు. అనంతరం రీజినల్ వేర్ హౌస్ మేనేజర్‌గా నియమితులయ్యారు. అలాగే బద్వేలు, కమలాపురం ఇన్‌ఛార్జి సీడీపీఓగా పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి పీడీగా బదిలీపై వెళ్లనున్నారు.

నేడు గంగమ్మ జాతర వేలంపాట

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మజాతర ఫిబ్రవరి నెల 28, మార్చి 1, 2 తేదీల్లో జరగనుంది. జాతర రోజు తలనీలాలు సేకరించే హక్కు, విడిదినాల్లో కొబ్బరికాయలు, పూజాసామగ్రి విక్రయం, షామియానా సప్లయర్స్ కోసం శనివారం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తెలిపారు. వేలంపాటలో పాల్గొనేవారు ఉదయం 10 గంటలకు గంగమ్మ ఆలయానికి రావాలని చెప్పారు. తలనీలాలకు సంబంధించి రూ. 50 వేలు, టోల్గేట్, టెంకాయ పూజా సామగ్రి, షామియానా సప్లయ్ సంబంధించి రూ. 30 వేలు డిపాజిట్ చేసి వేలంపాటలో పాల్గొనాలన్నారు. వేలం దక్కించుకున్న వెంటనే సగం డబ్బు, మిగిలిన నగదును పదిరోజుల్లోపు చెల్లించాలని శ్రీనివాసులు పేర్కొన్నారు.

మామిడిలో పూత, పిందె పరిశీలన



మామిడిచెట్లను పరిశీలిస్తున్న ఉద్యానశాస్త్రవేత్త సందీప్‌నాయక్

సిద్దవటం: మండలంలోని టక్కోలు, వంతాటిపల్లె, జ్యోతి, సిద్దవటం గ్రామాల్లోని మామిడి తోటల్లో పూత, పిందెలను శుక్రవారం అనంతరాజుపేట ఉద్యానయూనివర్సిటీ ఉద్యాన శాస్త్రవేత్త సందీప్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి ఆధ్వర్యంలో సిద్దవటం మండలం లోని మామిడి తోటలను పరిశీలించామన్నారు. జనవరి మాసంలో చాలా తోటల్లో పూత ఏర్పడటం మొదలైందన్నారు. పూత పురుగు నివారణకు రోగోర్ 2 మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పచ్చి పూత దశలో పిచికారీ చేసుకోవాలని తెలియజేశామన్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో 10 సంవత్సరాలు పైబడిన చెట్లకు 15 రోజులకు ఒకసారి తడులు ఇవ్వాలన్నారు. డ్రిప్ ద్వారా అయితే ఒక్కోచెట్టుకు రోజుకు 60-90 లీటర్లు నీటిని అందించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతుసేవా సిబ్బంది ప్రేమ్ సందీప్, వంశీ, శ్రీనాథ్, ప్రేమ్‌కుమార్, సిద్దవటం మండల మామిడి రైతులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు ముగ్గురు బ్యాడ్మింటన్ నిపుణులు

జిలానీబాషా నాగరాజు మనోహర్‌బాబు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ముగ్గురు సీనియర్ క్రీడాకారులకు ప్రతిష్టాత్మక 38వ జాతీయ క్రీడల్లో టెక్నికల్ అఫిషియల్స్‌గా పాల్గొనే అరుదైన అవకాశం లభించింది. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జాతీయ క్రీడలను నిర్వహించనున్నారు. జిల్లా బ్యాడ్మింటన్ సంఘం చైర్మన్‌గా, అంతర్జాతీయ అంపైర్‌గా వ్యవహరిస్తూ ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరం జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. జిలానీబాషా, బ్యాడ్మింటన్ సంఘంలో ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరిస్తూ, జాతీయస్థాయిలో గ్రేడ్-1 అంపైర్‌గా అర్హత సాధించి, కడప జిల్లా కోర్టులో గ్రేడ్-1 స్టెనోగా పనిచేస్తున్న వి. నాగరాజు, చిట్వేలి మండలంలో వెంకటరాజుపల్లె పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న గ్రేడ్-2 నేషనల్ అంపైర్ కె. మనోహర్ బాబు ఎంపికయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే నేషనల్ గేమ్స్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు బ్యాడ్మింటన్ నిపుణులు టెక్నికల్ అఫిషియల్స్‌గా ఎంపికవడం పట్ల జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

చదువు భారం.. అధనం

మదనపల్లెలోని జెడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న ఓ విద్యార్థికి స్టడీ మెటీరియల్‌ను ప్రింట్ చేసుకోవాలని, లేదా తనకు డబ్బులిస్తే రెండు పుస్తకాలను ప్రింట్ చేసి ఇస్తానని ఓ ఉపాధ్యాయుడు చెప్పారు. ఇదే విషయం తన తండ్రికి విద్యార్థి చెప్పాడు. అపుడు ఆ తండ్రి నువ్వు చదివేది ప్రభుత్వ పాఠశాలలోనే కదా..ప్రభుత్వం స్టడీ మెటీరియల్ సరఫరా చేయకుండా డబ్బులు అడగడం ఏమిటి? అని కుమారుడితో అన్నాడు. గతంలో ఎన్నడూ లేని ఈ పరిస్థితి చూసి తండ్రి అవాక్కయ్యాడు.



స్టడీఅవర్స్‌లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు

- పదో తరగతి విద్యార్థులకు అందని స్టడీ మెటీరియల్
- పీడీఎఫ్ కాపీ ఇచ్చి ప్రింట్ చేయించుకోవాలంటున్న ఉపాధ్యాయులు
- మారిన ప్రశ్నపత్రాలపై సాధన చేయలేని విద్యార్థులు

మదనపల్లె సిటీ: పదో తరగతి పరీక్షలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. అయితే సమయం సమీపిస్తున్నా స్పందించడం లేదు. నామమాత్రంగా ప్రత్యేక తరగతులతో కాలయాపన చేస్తోంది. స్టడీ మెటీరియల్ ఇవ్వడంలోనూ ఉత్సాహం చూపడం లేదు. ప్రశ్నపత్రాలు మారడం, స్టడీమెటీరియల్ తీసుకోవడానికి అధనపు భారం మోపడం తదితర కారణాలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. పబ్లిక్ పరీక్షలు రెండు నెలలు కూడా లేవు. ఇలాంటి సమయంలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది.

- పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఒకే ప్రణాళికను విద్యాశాఖ తయారు చేసింది. ఆ ప్రణాళిక ప్రకారం చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేకంగా సబ్జెక్టు నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను అందజేయాల్సి ఉంది. అయితే ఇంతవరకు ఆ వైపుగా చర్యలు చేపట్టలేదు. స్టడీ మెటీరియల్ ఇచ్చేందుకు తమ దగ్గర నిధులు లేవంటూ విద్యార్థులపైనే భారం వేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 23,311 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్నారు. పబ్లిక్ పరీక్షలు రెండు నెలలు కూడా లేవు. ఇలాంటి సమయంలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. ముఖ్యమైన ప్రశ్నలు, మోడల్ పేపర్స్‌తో మెటీరియల్‌ను అందించాలి. అయితే ప్రభుత్వం ఈ ఏడాది స్టడీ మెటీరియల్‌ను ప్రింటెండ్ పుస్తకం రూపంలో కాకుండా పీడీఎఫ్ సాఫ్ట్ కాపీ తరహాలో పంపింది. వాటిని అధికారులు ఎంఈఓలు, హెచ్‌ఎంలకు పంపించి, వాటిని ప్రింట్ తీయించుకోవాలని సూచించారు. ఈ ప్రింట్ భారం మనకెందుకని విద్యార్థులపై వేశారు. దీనిని బట్టి పేద విద్యార్థుల చదువుపై ప్రభుత్వంకు ఉన్న ప్రేమ ఏ పాటిదో స్పష్టమవుతోంది.



పరీక్షల నిర్వహణ ఇలా....

ఈ ఏడాది మార్చిలో పదో తరగతి పరీక్షలు ఇంగ్లీషు మీడియంతో పాటు ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌తో రాయనున్నారు. ఈ పరీక్షలను మాత్రం ఎస్ఎస్‌సీ నిర్వహిస్తుంది. ఆరు సబ్జెక్టులు, ఏడు పేపర్ల విధానంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్ణయించింది. సైన్సు సబ్జెక్టులో భౌతిక, రసాయన శాస్త్రం ఒకటిగా, జీవశాస్త్రం ఒకటిగా 50 మార్కుల చొప్పున రెండు పరీక్షలు నిర్వహించనున్నారు. మిగిలిన ఐదు సబ్జెక్టులకు సంబంధించి ఐదు పరీక్షలు 100 మార్కులకు ఉంటుంది ఏడు ప్రశ్నాపత్రాలుగా పరీక్షలు నిర్వహిస్తుండగా మారిన ప్రశ్నపత్రాలపై సాధన విద్యార్థులకు కష్టంగా ఉందని తెలుస్తోంది.

స్టడీ మెటీరియల్ ఇవ్వాలి



పరీక్షలు సమీపిస్తున్న స్టడీ మెటీరియల్ అందించకపోతే ఉత్తీర్ణత శాతం తగ్గుతుంది. స్టడీమెటీరియల్ ప్రింట్ చేయించుకోవాలంటే పేద విద్యార్థులపై భారం పడుతుంది. ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించాలి.

–మాధవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

మోడల్ పత్రాలతో ప్రాక్టీసు చేయిస్తున్నాం



పదో తరగతి విద్యార్థులకు ఎన్‌సీఈఆర్‌టీ పంపిన మోడల్ పత్రాల ద్వారా ప్రాక్టీసు చేయిస్తున్నాం. స్టడీ మెటీరియల్ రాలేదు. వంద రోజుల ప్రణాళికతో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాం. మంచి ఫలితాల కోసం కష్టపడుతున్నాం.

–సుబ్రమణ్యం, డీఈఓ

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత

- టీటీడీ వీజీఓ సదాలక్ష్మి



రంగ మండపాన్ని పరిశీలిస్తున్న సదాలక్ష్మి

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరుమల-తిరుపతి దేవస్థానం విజిలెన్స్ గెజిటెడ్ ఆఫీసర్ (వీజీఓ) సదాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె అధికారులతో కలిసి ఆలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా రామాలయంలోని అంతరాలయం, రంగ మండపాన్ని, కల్యాణవేదిక ప్రాంతాన్ని పరిశీలించారు. ఏప్రిల్ మాసంలో జరగబోయే వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించి అధికారులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆలయం వద్ద పెట్రోలింగ్ నిర్వహించాలని, తెలిపారు. కార్యక్రమంలో టీటీడీ విజిలెన్స్ భద్రతా సహాయాధికారి (ఏవీఎస్ఓ) సతీష్ కుమార్, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఆహ్వానం



తహూరాసమర్

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని తహూరాసమర్‌కు అరుదైన అవకాశం లభించింది. ఈనెల 26న సాయంత్రం 4.30 గంటలకు విజయవాడలోని గవర్నర్ కార్యాలయంలో జరిగే ఆట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితురాలుగా పాల్గొనాలని గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది.గతేడాది ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో 98% మార్కులు సాధించింది. తహూరాసమర్‌కు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పఠాన్ మహమ్మద్‌ఖాన్ అభినందనలు తెలిపారు. కాగా తహూరాసమర్ ప్రస్తుతం స్థానికంగా ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చేస్తోంది.

27 నుంచి ఎఫ్‌ఏ -3 పరీక్షలు

మదనపల్లె సిటీ: ఎఫ్ఏ-3 పరీక్షలను ఈనెల 27వతేదీ నుంచి 31వతేదీ వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. విద్యార్థి అభ్యసనాన్ని మదింపు చేసేందుకు విద్యాశాఖ ఏటా నాలుగు ఫార్మేటివ్, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించేందుకు 2022 నవంబర్ నుంచి ఎఫ్ఏ-1 పరీక్షలను క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ విధానంలో ప్రారంభించారు. ఎఫ్ఏ-2 పాత పద్ధతిలో నిర్వహించగా ఎఫ్ఏ-3 తిరిగి సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు.9,10 తరగతుల విద్యార్థులకు మాత్రం గతంలో మాదిరిగానే ఫార్మేటివ్ విధానంలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇదే పద్ధతి అవలంభిస్తున్నారు. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైంది.

ఉత్తమ ప్రమాణాల పెంపునకు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో అభ్యసన లోపాలను గుర్తించడంతో పాటుగా,పక్కా బోధనతో వారిలో సామర్థ్యాలను వెలికి తీయడం సీబీఏ పరీక్షల ప్రధాన ఉద్దేశం. గుణాత్మక విద్యను అందించడం, ఉత్తమ విద్యా ప్రమాణాలను పెంచేందుకు ఈ విధానం దోహదపడనుంది. ఎఫ్ఏ,ఎస్ఏల స్థానంలో సీబీఏ పరీక్షలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు సెల్ఫ్ అసెస్‌మెంట్ సీబీఏ విధానంలో నిర్వహిస్తున్నారు. 9,10 తరగతులకు నాలుగు సెల్ఫ్ అసెస్మెంట్స్, రెండు ఏఎస్ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

ఈనెల 31 వరకు పరీక్షలు

సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలకు ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు.జిల్లాలో 1,734 ప్రాథమిక, ప్రాథమికోన్నత 162, ఉన్నత పాఠశాలలు 304 ఉన్నాయి. ఇందులో 1,54,789 మంది విద్యార్థులతో పాటు ఎయిడెడ్, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని విద్యార్థులు ఎఫ్ఏ-3 పరీక్షలకు హాజరుకానున్నారు.

బైలింగ్వల్ ప్రశ్నపత్రాలు: సీబీఏ విధానంలో నిర్వహిస్తున్న పరీక్షలకు ఇచ్చే ప్రశ్నపత్రం పూర్తిగా ఇంగ్లీషు మీడియంలో ఉంటుంది. ప్రశ్నలు ఎంయుఏ విధానంలో ఇస్తారు. ప్రశ్నపత్రం అబ్జెక్టివ్ టైపులో ఇస్తారు. 15 మార్కులకు అబ్జెక్టివ్, ఐదు మార్కులకు రాత పూర్వక జవాబు రాయాల్సి ఉంటుంది. ప్రశ్నలన్నీ విద్యార్థిని సమగ్రంగా అంచనా వేసే విధంగా ఉంటాయి. మెకానికల్, అండర్ స్టాండింగ్, అప్లికేషన్ (ఎంయూఏ) విధానంలో ఉంటాయి. ఓఎంఆర్ పత్రాల్లో జవాబులు నింపి జిల్లాకు పంపించాల్సి ఉంటుంది.

పకడ్బందీగా నిర్వహించాలి: డీఈఓ

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఈఓ సుబ్రమణ్యం ప్రధానోపాధ్యాయులకు సూచించారు. గతంలో నిర్వహించిన అసెస్మెంట్‌పరీక్షల మాదిరిగానే సీబీఏ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు.

గడువు ముగిసె.. పనులు మిగిలె

- హార్సిలీహిల్స్‌లోని టూరిజం యూనిట్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం
- కాంట్రాక్టర్‌కు నోటీసు ఇవ్వాలని నిర్ణయం
- పర్యాటకులకు తప్పని ఇబ్బందులు

బి.కొత్తకోట: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై ఉన్న టూరిజం యూనిట్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు ఒప్పందం మేరకు తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలి. అయితే 20 శాతం కూడా పూర్తి చేయలేదు. ఒప్పందం గడువు ముగిసినా ఎందుకు పూర్తి చేయలేదన్న అనుమానాలు పర్యాటకశాఖ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ అంశంపై మంగళవారం విజయవాడలో పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) చైర్మన్ నూకసాని బాలాజీ అధ్యక్షతన జరిగిన ఈడీలు, డీవీఎంల సమావేశంలో సీరియస్‌గా చర్చించారని అధికార వర్గాలు తెలిపాయి. కాంట్రాక్టర్ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనికి కారణమేమిటి అనే అంశాల గురించి చర్చించారు. ఇందులో భాగంగా కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. దీంతో ఏమి జరగబోతుందో కానీ పర్యాటకశాఖకు మాత్రం నష్టాలు పెరగనున్నాయి.

రూ.93 కోట్లతో అభివృద్ధి పనులు

రాష్ట్రంలోని 15 టూరిజం యూనిట్లను ఆధునికీకరించి పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ. 93 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టింది. పర్యాటక రంగాన్ని అగ్రభాగాన నిలిపేలా చర్యలు చేపట్టింది. హార్సిలీహిల్స్‌పై మనుగడలోని 54 అతిథిగృహాల్లో పద్దెమిదింటిని అభివృద్ధి చేయడం కోసం గతేడాది ఏప్రిల్‌లో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ గదుల ఆధునికీకరణ, కొత్త బార్, రెస్టారెంట్ నిర్మాణం కోసం రూ.10,39,37,532లతో ఆర్.గంగయ్య అండ్ కో కంపెనీతో పర్యాటకశాఖ ఒప్పందం చేసుకుంది. ఒప్పందం మేరకు గత డిసెంబర్‌కే నిర్మాణ, ఆధునికీకరణ పనులు పూర్తి చేయాలి. ఇంకా పనులు పూర్తి కాలేదు. దీన్నిబట్టి పరిశీలిస్తే సత్వరమే పనులు పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ఆసక్తి చూపడం లేదని భావిస్తున్నారు.



హార్సిలీహిల్స్‌పై తనిఖీలు నిర్వహిస్తున్న ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ (ఫైల్)

నోటీసుతో పనవుతుందా..

కాంట్రాక్టర్‌కు నోటీసు ఇచ్చినా పనులు పూర్తయ్యే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. ఇప్పటికి ఐదుశాతం కూడా జరగలేదని హార్సిలీహిల్స్‌పై తనిఖీ చేసిన ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీ అసహనం వ్యక్తం చేశారు. త్వరగా ఆధునికీకరణ పనులు పూర్తి చేయించి అప్పగిస్తే అతిథులకు గదులు కేటాయించుకుని ఆదాయం పెంచుకుంటారు. లేదంటే నష్టాలు కొనసాగక తప్పదు.

టూరిజంకు మరింత నష్టం

18 గదులు ఇంకా వినియోగంలోకి రాలేదు. ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియని పరిస్థితుల్లో పర్యాటకశాఖ మరింత నష్టపోయేందుకు సిద్ధమైంది. సంక్రాంతి సెలవుల్లో రద్దీ తీవ్రంగా ఉంటుంది. మార్చి నుంచి ఎండ అధికమై సేదతీరేందుకు పొరుగు రాష్ట్రాల పర్యాటకులు అధికసంఖ్యలో ఇక్కడికి వస్తారు. గత ఏడాది వేసవిలోనూ గదుల సంఖ్య తగ్గిపోయింది. ఇప్పుడు ఇదే పరిస్థితి ఉండటంతో అతిథులకు గదులను అందుబాటులోకి తీసుకురాలేక ఆదాయం నష్టపోనుంది. గత డిసెంబర్ నాటికే రూ.55 లక్షల మేర నష్టపోయిన పర్యాటకశాఖ ఈ వేసవిలో కనీసం రూ.40 లక్షల పైగా నష్టపోయేలా ఉంది. అంటే ఈ ఆదాయం మొత్తం ప్రైవేటు అతిథిగృహాలకు వెళుతుంది.

చిగురించిన ఆశలు



- రోజురోజుకు పెరుగుతున్న నిమ్మ ధరలు
- జిల్లా వ్యాప్తంగా 5వేల హెక్టార్లలో నిమ్మ సాగు
- బెంగళూరులో బస్తా రూ.1000
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు

వేంపల్లె: నిమ్మకాయల ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో అన్నదాతల ఆశలు చిగురిస్తున్నాయి. నిలకడ లేని ధరలతో ఇబ్బందుల్లో ఉండే రైతులు ప్రస్తుతం ఉన్న ధరలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది ఇదే నెల చివరి వారంలో రూ.300 నుంచి రూ.450 లోపే బస్తా ధర ఉండేది. కానీ ఈ ఏడాది పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. గత వారం రోజులుగా ధరలు పెరుగుతూ గురువారం నిమ్మకాయల బస్తా రూ.800 నుంచి రూ.1000ల ధర పలికింది. గత ఏడాదంతా మార్కెట్ ధరలు పుంజుకోకపోవడంతో నిమ్మ రైతులు నష్టాలను ఎదుర్కొన్నారు. అయితే ఇప్పుడిప్పుడు నిమ్మ ధరలు ఊపందుకోవడంతో అన్నదాతలలో సంతోషం మొదలైంది. ఈ ఏడాది జనవరి 15వ తేదీ నుండి బెంగళూరు మార్కెట్‌లో నిమ్మకాయల బస్తా మొదటి రకం రూ.800 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. గత పది నెలలుగా బెంగళూరు మార్కెట్‌లో మొదటి రకం నిమ్మకాయల బస్తా రూ.400 నుంచి రూ.500 పలికేది. రెండవ రకం కాయలు రూ.300 మాత్రమే పలికేవి. కనీసం రైతుకు కూలి పాటు కూడా పడడం లేదు. గత పది రోజులుగా ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో నిమ్మ సాగు చేసిన రైతుల ఆశలు చిగురిస్తున్నాయి.



నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు



నిమ్మకాయలను రవాణా చేసేందుకు సంచులలో నింపుతున్న కూలీలు

ఎకరాకు రూ.75 వేల పెట్టుబడి: రైతులు మొక్క నాటిన నాటి నుంచి ఐదేళ్లపాటు ఎన్నో వ్యయప్రయాసలకు లోనై పెట్టుబడులు పెడతారు. నిమ్మతోట సాగులో ఎకరాకు రూ.75వేలు పెట్టుబడులు అవుతున్నాయి. ఏడాదికి మూడు కాపులు వస్తాయి. సాగులో దశలవారీగా తోటలు పూతకు రావడంతో దిగుబడులు కూడా వస్తుంటాయి. ఏడాదిలో ఒక కాపునకు ధరలు వచ్చినా ఆశించిన స్థాయిలో ఆదాయం ఉంటుందని రైతులు చెబుతుంటారు. కానీ ఇప్పుడు పరిస్థితుల్లో మార్పు కనిపించడంతో కొంతమేర నిమ్మ ధరలు పెరగవచ్చునని రైతులు అంటున్నారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో సైతం ధరలు పెరిగే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు.

కూలీల ఖర్చులకు పోను మిగులు


నిమ్మతోటలో కాయలు కోసి కూలీ, కమీషన్, సంచి రవాణా ఖర్చుకు, వరిగడ్డి, ఎత్తిన దించిన ఖర్చులు పోనూ రూ.400 మిగులుతుందని రైతులు చెబుతున్నారు. గత పది నెలలుగా ధరలు పతనం కావడంతో రైతులు నిమ్మ సాగు చేయాలంటే నిరాశ వ్యక్తం చేసేవారు. కానీ ప్రస్తుత పరిస్థితులలో కొంతమేర ధరలు ఆశాజనకంగా ఉండడంతో వారిలో ఉత్సాహం కలుగుతోంది.

నిమ్మ తోటల సాగు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5వేల హెక్టార్లలో నిమ్మ తోటలు సాగు చేశారు. అత్యధికంగా రైల్వే కోడూరు, వేంపల్లె, రాజంపేట, పెండ్లిమర్రి, చిట్వేలి, ముద్దనూరు, వీరపునాయినిపల్లె, చక్రాయపేట తదితర మండలాల్లోనూ, అత్యల్పంగా తొండూరు, సింహాద్రిపురం, వేముల, కొండాపురం, చింతకొమ్మదిన్నె, లింగాల తదితర మండలాల్లో నిమ్మ తోటలను సాగు చేశారు. ఇక్కడి నుంచి నిమ్మకాయలను బెంగళూరు, నాగపూర్, ఢిల్లీ తదితర మార్కెట్లకు వ్యాపారులు తరలిస్తుంటారు.

అప్పుల బారి నుండి బయటపడతాం



అప్పుల బారి నుండి బయటపడతామని అనుకుంటున్నాం. ధరలు రోజురోజుకు పెరిగిపోతుండటంతో రైతుల్లో ఆనందం కలుగుతోంది. ఆరు ఎకరాల్లో నిమ్మ తోటను సాగు చేశాను. గత రెండేళ్లుగా వర్షాలు సరిగా లేక భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. తోటలను బతికించుకునేందుకు అప్పులు చేసి బోర్లు వేయించుకున్నాం. ఈ సీజన్‌లోనైనా మంచి ధరలు వస్తాయని ఆశగా ఎదురుచూస్తున్నాం.

– షేక్ మహమ్మద్ గౌస్, నిమ్మ రైతు, వేంపల్లె

ఈ ధరలు నిలకడగా ఉండాలి



నిమ్మ ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఈ ధరలు నిలకడగా ఉంటే మాత్రం రైతులకు కొంతమేర ఊరట కలిగిస్తుంది. కాయలు ఉన్నప్పుడు ధరలేక ఇబ్బందులు పడ్డాం. గత పది నెలలుగా ధరలు లేక ఇక్కట్లు పడ్డాం. ఇప్పుడు మార్కెట్‌లో ధర ఊపందుకుంది. పెట్టుబడి పోను ఆదాయం వస్తుందనే ఆశతో ఉన్నాం.

– చావలి గోపాల్, నిమ్మ రైతు, చింతలమడుగుపల్లె

క్లుప్తంగా

కట్నం వేధింపులపై కేసు

బి.కొత్తకోట : కట్నం కోసం వేధించిన భర్త, అత్తపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు శుక్రవారం తెలిపారు. స్థానిక బీసీ కాలనీకి చెందిన రంజిత్ భార్య నీలిమను అదనపు కట్నం తీసుకు రావాలని భర్త, అత్త రెడ్డమ్మ మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రంజిత్, రెడ్డెమ్మలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్యానర్ల చించివేతపై కేసు

బి.కొత్తకోట : మంత్రి నారా లోకేష్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం రాత్రి బి.కొత్తకోటలో కట్టిన బ్యానర్లను చింపిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. టీడీపీ తెలుగు యువత మండల అధ్యక్షుడు చాకన రాజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రాజెక్టుల నిర్మాణంలో నిర్లక్ష్యం

– సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి అర్బన్ : సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, నిరుద్యోగులకు ఉపాధి కల్పన అంశంలోనూ చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడం తగదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి. ఈశ్వరయ్య మండిపడ్డారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రూ.906 కోట్లతో హంద్రీ – నీవా ప్రాజెక్టు పనులు పూర్తిచేస్తామంటున్న చంద్రబాబు పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పాలంటూ డిమాండ్ చేశారు. వరదల్లో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు పునర్నిర్మాణంపై పాలకులు మాటలకే పరిమితయ్యారంటూ ఆగ్రహించారు. అన్నమయ్య ప్రాజెక్టుకు మొండిచేయి చూపడం దారుణమన్నారు. అమరావతిపై ప్రేమ చూపుతూ రాయలసీమను మరచిపోతున్నారని ఎద్దేవా చేశారు.ప్రశ్నిస్తా .... ప్రశ్నిస్తా అంటూ రెచ్చిపోయిన పవన్‌కళ్యాణ్ సనాతనం పేరుతో మతాలను రెచ్చగొడుతున్నాడే కాని రాయలసీమ అభివృద్ధికి మాట్లాడిందేమీ లేదంటూ విమర్శించారు. ఎర్ర బుక్కు పేరుతో పాలకులు ప్రత్యర్థులను బెదిరిస్తూ కూటమి నాయకులు సంచులు నింపుకొంటున్నారంటూ మండిపడ్డారు. నరసింహులు, మహేష్, కోటేశ్వరరావు, టీఎల్.వెంకటేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మైనర్‌కు బండి.. డేంజరండి

- ద్విచక్ర వాహనం పట్టు జారితే ప్రమాదం!
- ప్రాణం మీదకు తెచ్చుకొంటున్న బాలలు
- ఒకే వాహనంపై నలుగురితో విన్యాసాలు
- ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి
- పట్టించుకోకుండా చోద్యం చూస్తున్న పోలీసులు

నిండా పదేళ్లు నిండని మైనర్లు.. ఆపై ద్విచక్ర వాహనం ఎక్కారు. ఒకరు.. ఇద్దరు కాదు ఏకంగా నలుగురు స్కూటర్‌పై షికార్లు కొడుతూ విన్యాసాలు చేస్తారు. గుర్రంకొండలో ఈ దృశ్యాలు ప్రతి నిత్యం కనిపిస్తుంటాయి. కడప–బెంగళూరు జాతీయ రహదారిపై పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లతో ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారు. ఇటీవల ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఇందుకు అద్దం పడుతోంది.





గుర్రంకొండ వద్ద జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంలో వెళ్తున్న మైనర్లు



బస్టాండులో స్కూటర్‌పై నలుగురు చిన్నారుల ప్రయాణం

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలో మైనర్లు ద్విచక్ర వాహనాలపై హల్ చల్ చేస్తున్నారు. వీరిలో పదేళ్ల నుంచి పన్నెండేళ్ల వయసున్న చిన్నారులే ఎక్కువ. ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటంటూ జనం ముక్కున వేలేసుకుంటున్నారు. రహదారి భద్రతా నిబంధనలు తెలియని చిన్న పిల్లలకు ఇలా వాహనాలిచ్చి రోడ్లపైకి పంపిన తల్లిదండ్రులు తగిన మూల్యం చెల్లించుకుంటున్నారు. బస్టాండు, రద్దీ, జనసంచారం ఉండే ప్రాంతాల్లో వారు ఇష్టానుసారం నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొందరు పిల్లలు దర్జాగా బైక్‌లపై పాఠశాలలకు వెళ్తున్నారు. తిరిగి ఇంటికి వచ్చే సమయంలో పోటీపడి రోడ్లపై నడుపుకొంటూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇలాంటి ఆగడాలు ఇటీవల శృతిమించిపోతున్నాయి. వీధుల్లోనూ ఎక్కువ వేగంతో వెళ్తుండడంతో ఇతర వాహనదారులు భయపడుతున్నారు.

శబ్దాలు చేసే సైలెన్సర్లతో..

కొంతమంది ఆకతాయి మైనర్లు పట్టణంలో పెద్ద శబ్దాలు చేసేలా సైలెన్సర్లు తీసి ద్విచక్ర వాహనాలు వేగంగా నడుపుతున్నారు. బస్టాండులోనూ స్కూటర్ల ముందు భాగాన్ని పైకి లేపి నడుపుతూ విన్యాసాలు చేస్తున్నారు. ఒక్కోసారి ఈ వ్యవహారం బెడిసి కొట్టి ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. వారే కాదు.. అటుగా వచ్చే జనం ప్రమాదానికి గురవుతున్నారు. కొత్తపేట వీధిలో వేగంగా ద్విచక్ర వాహనంలో వెళ్తున్న మైనర్లు ఇళ్లలో నుంచి వీధిలోకి వస్తున్న చిన్నారులను ఢీకొనడంతో ఇద్దరు ఆస్పత్రులపాలయ్యారు. బలిజగడ్డ, తాళీంవీధి, బజారువీధి, కొత్తపేట లాంటి ప్రాంతాల్లో మైనర్లు వాహనాలను నడిపి పలువురినీ గాయాలపాలు చేసిన సంఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి.

మైనర్లకు వాహనం ఇస్తే జరిమానా

కొందరు వాహనదారులు మైనర్లకు వాహనాలు ఇస్తుంటారు. ఈ క్రమంలో వారు పోలీసులకు పట్టుబడితే జరిమానా విధిస్తూ ఉంటారు. ఇటీవల పుణెలో ఓ మైనర్.. కారు నడిపి ఇద్దరి ప్రాణాలు పోవడానికి కారణమయ్యాడు. దీంతో ఇటీవల చట్టం నూతన చట్టం మఅలులోకి తెచ్చింది. 304 పార్ట్ 2 కింద మైనర్ వాహనం నడిపినపుడు ప్రమాదం జరిగి ఆవల వ్యక్తి చనిపోతే వాహన యజమానిగానీ, బాలుడి తల్లిదండ్రులు గానీ శిక్షించబడతారు. మోటారు వాహన చట్టం 199ఎ ప్రకారం మైనర్ల తల్లిదండ్రులు, వాహన యజమానులకు గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే రూ.25000 వరకు జరిమానా విధించవచ్చు. ఏడాది పాటు సదరు వాహనం రిజిస్ట్రేషన్ రద్దు చేయడం, మైనర్‌కు 25 ఏళ్లు వచ్చే వరకు లైసెన్సు జారీ చేయకపోవడం చేస్తారు.

చోద్యం చూస్తున్న పోలీసులు

నిత్యం జన సంచారం ఎక్కువగా ఉండే పట్టణంలో మైనర్లు ద్విచక్ర వాహనాలతో హంగామా చేస్తున్నా.. పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు విమర్శిస్తున్నారు. వారి ఆగడాలపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు చోద్యం చూడడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంకాలం నిఘా ఉంచితే చాలా వరకూ ప్రమాదాలను అరికట్టవచ్చు. మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు. కొత్తగా వచ్చిన చట్టంపై అవగాహన కల్పించాలని చెబుతున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తాం



మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వకూడదని తెలియజేస్తూ వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇస్తాం. తరచూ పట్టణంలో నాకాబందీ నిర్వహించి మైనర్ల ద్విచక్ర వాహనాలు నడపితే జరిమానా విధిస్తాం. పట్టణంలో రోడ్ స్టాపర్లను పలుచోట్ల ఏర్పాటు చేసి పాఠశాల సమయాల్లో బందోబస్తు ఏర్పాటు చేస్తాం. తల్లిదండ్రులు వీటిపై ఆలోచించి మైనర్లకు వాహనాలిస్తే చట్టపరంగా తీసుకోబోయే చర్యలపై అవగాహన కల్పిస్తాం.

– మధురామచంద్రుడు, ఎస్ఐ, గుర్రంకొండ.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మైనర్లు మృతి




మృతులు హర్షవర్ధనాచారి, నరేంద్రాచారి(ఫైల్)

పాఠశాలకు వెళ్లాలనే ఆతృతతో ఇద్దరు మైనర్లు ద్విచక్ర వాహనం నడుపుతూ రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటనలు చోటుచేసుకొన్నాయి. మండలంలోని బోడిగుట్ట, మెరంపల్లెకు చెందిన హర్షవర్ధనాచారి(07). నరేంద్రాచారి(15లు పాఠశాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో బయలు దేరారు. గుర్రంకొండకు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడిక్కడే మృతిచెందారు. ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించిబోయి అవగాహనా రాహిత్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకొన్నారు. కనీసం వారికి వాహనాలిచ్చే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్ లేదనే భావన తల్లిదండ్రులకు కలగకపోడవం బాధాకరం. గతంలో గుర్రంకొండ పట్టణంలో పది వరకూ రోడ్డుప్రమాదాలు జరిగి పలువురు ఆస్పత్రుల పాలయ్యారు.

మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులపై కేసు

బి.కొత్తకోట : తంబళ్లపల్లి మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ యాదవ్ వర్గీయులపై అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నారా లోకేష్ జన్మదినం సందర్భంగా బుధవారం రాత్రి బి.కొత్తకోటలో శంకర్ వర్గీయులు బ్యానర్లను ఏర్పాటు చేశారు. తెల్లారేసరికల్లా ఇవి చిరిగిపోయి ఉన్నాయి. ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి జయచంద్రా రెడ్డి వర్గీయులే చేసి ఉంటారని శంకర్ వర్గీయులు ఆరోపించారు. సోషల్ మీడియాలోనూ ఇదే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో చెన్నక అరుణ్ కుమార్ అనే వ్యక్తి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో నారా లోకేష్ బ్యానర్లను శంకర్ వర్గీయులు కట్టారని, వాటిని వారే చింపేసి ఆ నిందను జయచంద్రారెడ్డిపై వేశారని పేర్కొన్నారు. శంకర్‌కు కోవర్టుగా పనిచేస్తూ జయచంద్రారెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు బి.కొత్తకోట, పెద్దతిప్ప సముద్రం, ములకలచెరువు, తంబళ్లపల్లె మండలాలకు చెందిన సాగర్ కుమార్, నాగార్జున, సుదర్శన్ రెడ్డి, పురుషోత్తం, రాజా, సుదర్శన్, కురవ ప్రకాష్, సురేష్ యాదవ్ లపై సీఐ జీవన్ గంగనాథ్ బాబు కేసు నమోదు చేశారు.

దర్గా స్వామిజీ ఆరాధన



దర్గా స్వామిజీకి పూజలు చేస్తున్న వేదపండితులు

రామాపురం : మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలో వెలసిన దర్బార్ సాయి నగరంలో దర్గా స్వామిజీ ఆరాధన శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి గంగ పూజ, కలశ పూజ, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, మంగళహారతి, సాయంత్రం రుద్రాభిషేకం, పల్లకి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన వేద పండితులచే పూజలు జరిపినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


గొర్రెల మృతికి పీపీఆర్ వ్యాధి కారణం



పరీక్షలు నిర్వహిస్తున్న పశు వైద్యులు

ఒంటిమిట్ట : మండలంలోని నరవకాటిపల్లిలో పదుల సంఖ్యలో గొర్రె పిల్లలు మృతి చెందడానికి పీపీఆర్ వ్యాధి కారణమని పశుసంవర్ధక శాఖ కడప డివిజన్ ఉప సంచాలకులు రమణయ్య తెలిపారు. నరవకాటిపల్లి గ్రామానికి ఆయనతోపాటు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏడీ డాక్టర్ రాజశేఖర్, వైద్యాధికారి డాక్టర్ సంధ్యా రాణి, ఒంటిమిట్ట ఏడీ ఉమ చేరుకుని విచారించారు. గొర్రెల స్వాబ్స్ నమూనా తీసుకొని వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ గొర్రె పిల్లలు పీపీఆర్ వ్యాధితో చనిపోయాయని, మరిన్ని గొర్రెలకు వ్యాధి సోకిందన్నారు. మరిన్ని పరీక్షల కోసం నమూనాలను విజయవాడకు తరలించామని వివరించారు, గొర్రె పిల్లలను బహిరంగ ప్రదేశాలలో కాకుండా మంచుకు, చలికి రక్షణ కల్పించే విధంగా చూసుకోవాలని పోషకదారులకు సూచించారు.

కల్లుగీత కార్మికులకు 11 మద్యం దుకాణాలు



లాటరీ పద్ధతిలో కేటాయిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా కల్లు గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం 11 మద్యం దుకాణాలు కేటాయించినట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ రామకూరి తెలిపారు. కలెక్టరేట్‌లో లాటరీ ద్వారా శుక్రవారం దుకాణాలు కేటాయించారు. గీత కులాలలోని గౌడ, ఈడిగ, గౌండ్ల, గౌడ్ వంటి ఉప కులాల వారికి బహిరంగ లాటరీ పద్ధతిలో కేటాయించారు. రాయచోటి, మదనపల్లె, రాజంపేటలతోపాటు మొత్తం 11 షాపులకు ఈ లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, కల్లుగీత కులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్టు

మదనపల్లె : పోక్సో కేసులో మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి మోసం చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్ఐలు రహీముల్లా, గాయత్రి తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. మదనపల్లె గొల్లపల్లి బాలాజీనగర్‌లో నివాసముంటున్న ఓ మైనర్ బాలిక (17), స్థానిక ప్రభుత్వ మహిళ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గుర్రంకొండ మండలం అమిలేపల్లికి చెందిన ఆనంద్ కుమారుడు చరణ్‌తేజ(19) నెల్లూరులో బి.ఫార్మసీ చదువుతున్నారు. స్నాప్‌చాట్ సోషల్ మీడియా వేదికగా వీరిద్దరికీ పరిచయం పెరిగింది. నిందితుడు చరణ్‌తేజ మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి ఈ నెల 9వతేదీన తనతోపాటు తీసుకువెళ్లాడన్నారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. పట్టణంలోని రెడ్డప్ప నాయుడు కాలనీలో శుక్రవారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్ఐలు

ఎర్రచందనం అక్రమార్కులకు జైలు శిక్ష


– జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు



శిక్ష పడిన నిందితులు వీరే

రాయచోటి : ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తున్న కేసులో ముగ్గురు నిందితులకు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2016లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న అన్నమయ్య జిల్లా కెవిపల్లి మండలం సంగటివారిపల్లికి చెందిన సంగటి చిన్నయ్య(47), సంగటి సహదేవ(33), సంగటి వీరభద్ర(30)లను అప్పటి కెవీ.పల్లి పోలీస్ స్టేషన్ఎస్ఐ వి.సుమన్ పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అన్ని కోణాల్లో ఎస్ఐ కెవీ.శివకుమార్ దర్యాప్తు చేసి సమగ్ర నివేదిక కోర్టుకు సమర్పించారన్నారు. ఆ నివేదిక ఆధారంగా తిరుపతి జిల్లా ఆర్ఎస్ఎస్ ఏజేడీ న్యాయమూర్తి నరసింహమూర్తి ముగ్గురు నిందితులకు ఐదేళ్ల శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. అక్రమ రవాణా చేసే వారికి ఈ తీర్పు ఒక గుణపాఠం కావాలని ఎస్పీ అభిప్రాయపడ్డారు. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.కోటేశ్వర్‌రెడ్డి, రెడ్ శాండిల్ యాంటీ స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు బి.రాఘవరెడ్డి, టి.మధు, అప్పటి దర్యాప్తు అధికారి కెవీ.పల్లి ఎస్ఐ వి.సుమన్, ఎస్ఐ కెవీ.శివకుమార్, కానిస్టేబుళ్లు కె.ఆదినారాయణ, కె.శ్రీనివాసులును ఈ సందర్భంగా ఎస్పీ అభినందించారు.

హంద్రీ–నీవా కాల్వ సామర్థ్యం పెంచాలంటూ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు

రాయచోటి అర్బన్ : హంద్రీ–నీవా కాల్వ సామర్థ్యాన్ని పది వేల క్యూసెక్కులకు పెంచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. రాయచోటి కలెక్టరేట్ ఎదుట సీపీఐ కార్యకర్తలతో కలిసి శుక్రవారం ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ హంద్రీ–నీవా కాల్వ విస్తరణ పనులు వెంటనే చేపట్టాలన్నారు. హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80వేలు, అనంతపురంలో 3,45,000, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లా 1.40వేల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సి ఉందన్నారు. వర్షాకాలంలో వరదనీటిని ఎక్కువగా తీసుకునే సామర్థ్యం కాల్వకు లేదని, 10 వేల క్యూసెక్కులకు పెంచుతామంటూ 2019లో హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడైనా నెరవేర్చాలన్నారు. అవసరమైన నిధులను వెంటనే రాష్ట్ర బడ్జెట్ నుంచి విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్.నరసింహులు, సహాయ కార్యదర్శి మహేష్, వంగిమళ్ల రంగారెడ్డి, సాంబశివ, సిద్దిగాళ్ల శ్రీనివాసులు, శివరామక్రిష్ణ, సుమిత్రమ్మ, మనోహర్‌రెడ్డి, సుధీర్‌కుమార్, జ్యోతి చిన్నయ్య, మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు వేతనం పెంచాలి



మోకాళ్లపై నిలబడి నిరసన

రాజంపేట రూరల్ : పౌర సరఫరాల విభాగంలో పనిచేసే హమాలీలకు వేతనం పెంచాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఇ.సిఖిందర్ డిమాండ్ చేశారు. రాజంపేట తహశీల్దారు కార్యాలయం వద్ద, లక్కిరెడ్డిపల్లెలోని సివిల్ సప్లయ్ గోదాములు శుక్రవారం మూసివేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఖిందర్ మాట్లాడుతూ సివిల్ సప్లై కార్పొరేషన్‌ను పాలక ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సూరి, కార్యదర్శి రాఘవేంద్ర, నాయకులు ప్రసాద్, కోదండం, చౌడయ్య, ఈశ్వర్, రామాంజనేయులు, జమాల్, వెంకటేష్, గంగన్న, వీరన్న, కొమటీ, శ్రీను పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : హమాలీలకు వేతనం పెంచాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సివిల్ సప్లయ్ గోదాము మూసి మోకాళ్లపై నిలబడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచాల్సి ఉండగా పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో యు.జగదీష్, షఫీ ఉల్లా, ముభారక్, తాజ్ బాబా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ బిడ్డలు లేనిదే మానవ సృష్టి లేదు

జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా




జాతీయ బాలికల దినోత్సవం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిబ్బంది

సిద్దవటం : ఆడబిడ్డలు లేనిదే మానవ సృష్టి లేదని.. నేటి ఆడబిడ్డలే రేపటి తల్లులు అని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్ బాషా తెలిపారు. సిద్ధవటం నలంద పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమీర్ బాషా మాట్లాడుతూ సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజలలో అవగాహన పెంచడానికి, బాలల చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఏటా జనవరి 24న జాతీయ బాలికల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ బాలికల పట్ల వివక్షత చూపరాదన్నారు. భ్రూణ హత్యల నివారణ, సమాజంలో చైతన్యాన్ని పెంచే చట్టాల అమలుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని తెలిపారు. జేవీవీ మండల అధ్యక్షుడు రామకేశవ మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఆమోదిస్తూ తక్షణమే చట్టం చేయాల కోరారు. అనంతరం జాతీయ బాలికల దినోత్సవం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకుకు భూరి విరాళం

- బ్యాంక్ అభివృద్ధికి రూ.30 లక్షల నగదు
- 12 ఎకరాల భూమి కేటాయింపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఛైర్మన్ సుధాహరరెడ్డి

పెద్దమండ్యం : మండలంలోని కలిచెర్ల సహకార బ్యాంకు మాజీ ఛైర్మన్ కడప సుధాహరరెడ్డి ఆ బ్యాంకుకు తన భూరి విరాళాన్ని ప్రకటించారు. కలిచెర్ల సహకార బ్యాంకు ఆధ్వర్యంలో నడుస్తున్న హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం సంఘం సభ్యులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుధాహరరెడ్డి మాట్లాడుతూ కలిచెర్లలో సహకార బ్యాంకు ఏర్పాటైనప్పటి నుంచి తన కుటుంబం బ్యాంకు అభివృద్ధి కోసం కృషి చేసినట్లు తెలిపారు. ఛైర్మన్‌గా సుదీర్ఘ కాలం పనిచేసినందుకు తన వంతు విరాళంగా బ్యాంకు అభివృద్ధికి రూ.30 లక్షల నగదు, 12 ఎకరాల భూమిని ప్రకటించారు. రూ.30 లక్షల నగదు ఇప్పటికే డిపాజిట్ చేసినట్లు వెల్లడించారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం సహకార బ్యాంకు పేరిట 12 ఎకరాలు రిజిష్టర్ చేసి ఆ పత్రాలను తహసీల్దారు సయ్యద్ అహ్మద్‌కు అందజేశామన్నారు. సహకార బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి సి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 41 సహకార బ్యాంకులుండగా, కలిచెర్ల బ్యాంకు అభివృద్ధిలో మాజీ ఛైర్మన్ సహకారం మరువలేనిదన్నారు. త్వరలో అపోలో మెడికల్ స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో శిద్దవరం విశ్వనాథరెడ్డి, తహసీల్దారు సయ్యద్ అహ్మద్, సర్పంచ్ జింకా విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు ఎన్నటికీ నమ్మరు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్ : సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గడచిన ఏడు నెలల్లో పేదలకు ఇచ్చిన హామీలు ఎగ్గొట్టే పాలన చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, కొండూరు అజయ్‌బాబు అన్నారు. అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ పథకాల నగదు నేరుగా మహిళల ఖాతాకు చేరిందన్నారు. చంద్రబాబు పేదలకు పథకం ప్రయోజనాలివ్వకుండా మోసం చేస్తూ నెలకు ఓ నాటకం రక్తి కట్టిస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆరోపించారు. కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్రానికి రూ.3 లక్షల కోట్లు ఇచ్చినట్లు ప్రకటించారని, సంక్షేమం, అభివృద్ధి చేయకుండా ఆ నిధులు ఏదారిలో వెళ్లాయో తెలపాలన్నారు. ప్రజలను మరిచి కేవలం తన కొడుకు లోకేష్ సంక్షేమం కోసం చంద్రబాబు పనిచేస్తున్నారని తెలిపారు. అప్పట్లో వైఎస్సార్, వైఎస్ జగన్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారని, కానీ చంద్రబాబు తన కుటుంబానికి, తన అనుయాయులకు మేలు కలిగేలా పాలన చేస్తున్నారని తెలిపారు. తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్షా 70 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చారని, కర్ణాటక వాళ్లు రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చారని, చంద్రబాబు ఏ మేరకు తెచ్చారో చెప్పాలన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలి

మాజీ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డిని లేపేస్తానని బహిరంగంగా హెచ్చరించిన మాజీ జడ్జి రామకృష్ణ వ్యాఖ్యలు సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేయాల ఆయన కోరారు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పంజం సుకుమార్‌రెడ్డి, సీహెచ్.రమేష్, శివారెడ్డి, రత్తయ్య, దాడిశెట్టిసిద్ధూ, గల్లా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.